కరాటే పోటీలు

బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ గజ్జారాం

కుంటాల, మార్చి 17: మండల కేంద్రంలోని విజయ సాయి పాఠశాలలో ఆదివారం రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ స్వప్న తెలిపారు. ఈ పోటీల్లో తమ పాఠశాలతో పాటు వివిధ మండలాల నుంచి విద్యార్థులు పాల్గొన్నారని పేర్కొన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు బెల్టు అందజేసినట్లు చెప్పారు. ఎంపీపీ ఆప్క గజ్జారాం, ఏఎస్ఐ దేవరావు, కరాటే మాస్టర్ తేజందర్ సింగ్ భాటియా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సోదాలు

మాట్లాడుతున్న సీఐ రాజారెడ్డి

భైంసా, మార్చి 17 : అసాంఘిక శక్తుల ఆట కట్టించడంతో పాటు నేరాలను నియంత్రించేందుకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. పట్టణంలోని రాహుల్ నగర్‌లో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడడంతో పాటు ప్రజల్లో భరోసా కల్పించేందుకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుమానితుల సమాచారం పోలీసులకు అందించాలని స్థానికులకు సూచించారు. తనిఖీల్లో భాగంగా సరైన పత్రాలు లేని 86 ద్విచక్రవాహనాలు, రెండు ఫోర్‌వీలర్స్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఎస్ఐ గౌస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల వేళలు మార్పు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి17: వేసవి నేపథ్యంలో అంగన్‌వాడీ కేంద్రాల పనివేళలను మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఎండలు ముదురుతుండడంతో, పలు సంఘాల విన్నపం మేరకు పనివేళ్లు మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉదయం 8 గంటల నుంచి 12.30 గంటల వరకు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాలని మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

నిర్మల్ చైన్‌గేట్, మార్చి,17: పట్టణంలోని వాసవి వరల్డ్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాల్ శైలాజాయనన్, ప్యాట్రన్ లింగారెడ్డి, కరస్పాండెంట్ పోతారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

'చెత్త'లో బండి

దిలావర్‌పూర్‌లో రోడ్డు పక్కన పడివేసిన చెత్తబండి

గ్రామంలో ఇండ్ల నుంచి చెత్తను సేకరించే బండిని ఇలా నిర్లక్ష్యంగా పడేశారు. ప్రభుత్వం వేలాది రూపాయలు వెచ్చించి ఈ మూడు చక్రాల బండిని కొనుగోలు చేసి, పంచాయతీలకు అప్పగించింది. కొన్ని రోజుల పాటు వీటితోనే చెత్తను సేకరించారు. ఆ తర్వాత వీటిని వినియోగించకుండా ఇలా మూలన పడేశారు. దిలావర్‌పూర్ మండల పరిషత్ కార్యాలయం సమీపంలో చెత్తలో ఈ బండి ఉంది. అధికారులు స్పందించి వీటిని వినియోగంలోకి తీసుకువచ్చి, చెత్తను సేకరించాలని స్థానికులు కోరుతున్నారు.

-దిలావర్‌పూర్, మార్చి 17

'కోడ్' కూసింది

న్యూలోలంలో ప్రచార పోస్టర్లను తొలగిస్తున్న సిబ్బంది

లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అధికార యంత్రాంగం ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచార బోర్డులు, వివిధ పార్టీలకు చెందిన అభ్యర్థుల ప్రచార బోర్డులను తొలగిస్తున్నారు. దిలావర్‌పూర్, న్యూ లోలం గ్రామాల్లో జాతీయ రహదారి పక్కన, ఇంటి గోడలపై ప్రచార బోర్డులను పంచాయతీ సిబ్బందితో కలిసి ఎంపీడీవో అరుణారాణి, తీసివేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో,ప్రభుత్వ స్థలాల్లో అనుమతి లేకుండా ప్రచార బోర్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల బోర్డులను పెట్టరాదని సూచించారు.

-దిలావర్‌పూర్, మార్చి 17

ప్రయాణం.. ప్రమాదకరం

పీచర చెరువుకట్టపై ప్రమాదకరమైన స్థితిలో వెళ్తున్న బస్సులు

లక్ష్మణచాంద మండలంలోని పీచర గ్రామంలోని కుమ్మరికుంట చెరువుకట్టపై రహదారి ఇరుకుగా మారడంతో ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. మండలంలోని పీచర గ్రామం నుంచి ధర్మారం, మునిపెల్లి వైపు ప్రతి నిత్యం పదుల సంఖ్యలో బస్సులు, ఇతర వాహనాలు ప్రయాణిస్తున్నాయి. ఈ చెరువుకట్ట ఇరుకుగా ఉండడంతో పాటు హరితహారంలో భాగంగా ఇరువైపులా నాటిని మొక్కలు పెరిగి, పూర్తిగా ఇబ్బందికరంగా మారాయి. అధికారులు స్పందించి చెరువుకట్ట వెడల్పు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

-లక్ష్మణచాంద, మార్చి 17

గ్రామీణుల 'ఉపాధి'కి హామీ

- గ్రామాల్లో వలసల నివారణకు దోహదం చేస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ పథకం
- నిరుపేద కుటుంబాలకు భరోసా
- పల్లెల్లో ఊపందుకున్న పనులు

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దస్తురాబాద్,మార్చి 17: గ్రామీణ ప్రాంత నిరుపేదలకు ఉపాధి కల్పించి, వారికి ఆర్థికంగా భరోసా కల్పించడమే లక్ష్యంగా ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిరుపేద కుటుంబాలకు వరంలా మారింది. కూలీలకు 5 కిలోమీటర్ల లోపు పరిధిలో ఉపాధి కల్పించడమే ఈజీఎస్ లక్ష్యం. నిత్యం రెక్కాడితేనే డొక్క నిండని పేదలకు ఈ పథకం ఎంతో మేలు చేస్తున్నది. పొదుపు, ఇతర అవసరాలకు కూలీల కష్టం ఉపయోగపడుతున్నది. మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రస్తుతం ఉపాధి పనులు ఊపందుకున్నాయి. జాబ్ కార్డు ఉన్న కూలీలకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు నిత్యం పనులు కల్పిస్తారు. పనులను పర్యవేక్షిస్తారు. కాగా, ప్రస్తుతం వేసవి కాలం కావడంతో పల్లెల్లో వ్యవసాయ పనులు అంతగా లేవు. దీంతో ఉపాధి హామీ పథకం పనుల వైపు పరుగులు తీస్తున్నారు.

గ్రామాల్లో జోరుగా ఉపాధి పనులు

మండలంలోని దస్తురాబాద్, దేవునిగూడెం, మల్లాపూర్, గొడిసేర్యాల, ఆకొండపేట, రేవోజిపేట గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామాలతో పాటు అటవీ భూముల్లో నీటిని నిల్వ చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

8273 మంది కూలీలు

ప్రస్తుతం మండలంలో 4737 జాబ్ కార్డులున్నాయి. మొత్తం 8273 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం 4302 జాబ్ కార్డులు యాక్టివ్‌లో ఉండగా, 6312 మంది ఉపాధి హామీ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో కూలీలు ఫాం పాండ్, కందకాల తవ్వకాలు చేపడున్నారు. రానున్న రోజుల్లో ఇంకా కూలీలు పెరిగే అవకాశమున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రతి కూలీకి పని కల్పిస్తాం..

జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ ఉపాధి పనులు కల్పిస్తాం. 100 రోజుల పని కల్పిస్తాం. గ్రామ పంచాయతీ కార్యదర్శుల వద్ద పనికి వచ్చే కూలీలు తమ పేర్లు, గ్రూపు పేర్లను నమోదు చేసుకోవాలి. ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి. అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పనులు ముమ్మరం కావడంతో కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పనులు చేసేటప్పుడు కూలీలు పలు జాగ్రత్తలు పాటించాలి.అర్హులైన వారికి జాబ్ కార్డులు అందజేస్తున్నాం.

-రవి ప్రసాద్, ఏపీవో, దస్తురాబాద్

బాధిత కుటుంబానికి మిత్రుల భరోసా

ఖానాపూర్ రూరల్, మార్చి 17: ఖానాపూర్ మండలంలోని దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన సల్లరాజు కుటుంబానికి అదివారం తన చిన్ననాటి స్నేహితులు ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. కొన్నేండ్ల క్రితం జీవనోపాధి కోసం కువైట్ వెళ్లిన రాజు, ఇటీవల సెలవుపై వచ్చి, ఆకస్మాత్తుగా గుండెపోటుతో మరణించాడు. ఇంటికి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఈ సందర్భంగా చిన్న నాటి మిత్రులు రూ. 25,500ను అందజేశారు. రాజు కూతురి పేరిట బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేయించారు. దాసరి రాజేశ్వర్, తుమ్మనపల్లి నరేశ్, దాసరి కృష్ణమూర్తి, సునీల్, కాలేరి దివాకర్, సంద రాకేశ్, అజీమ్, సింగరవి, సీహెచ్ రాజు, అశోక్, సల్ల మల్లేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న చిన్ననాటి మిత్రులు

ఉద్యమకారుల ఫోరం కార్యవర్గం

వెంకటేశ్‌ను సన్మానిస్తున్న జిల్లా ఫోరం అధ్యక్షుడు

కుంటాల, మార్చి 17: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కుంటాల కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ముష్కం రామకృష్ణాగౌడ్ నేతృత్వంలో ఆదివారం కుంటాలలో సమావేశం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా విశ్రాంత ఉపాధ్యాయుడు గొడిసెల రమేశ్ గౌడ్, అధ్యక్షుడిగా దొనికేని వెంకటేశ్, ఉపాధ్యక్షుడిగా మగ్గిడి దిగంబర్, కార్యదర్శిగా పెంటవార్ దశరథ్, కోశాధికారిగా టీ. రజనీకాంత్, సహ కార్యదర్శిగా భోగ లక్ష్మణ్, జిల్లా సభ్యులు జుట్టు మహేందర్, పూస శంకర్, రావుల వనిత, మండల సభ్యులుగా పోశెట్టి, షిందే దత్తు, వాడేకర్ దత్తురాం, సిందే నా గరాజు, గల్లాపురం రమేశ్, గోలే గంగాధర్, షిందే రవీందర్, మీడియా ప్రతినిధులుగా రవి, జగన్ రెడ్డి, సాయిబాబు, బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమం లో పాల్గొన్న వారిని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని కోరారు. మండల బాధ్యులు ముజ్జే రవి, పుండలిక్ రావు పటేల్, జనార్దన్‌రెడ్డి, పాల్గొన్నారు.

ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నిర్మల్ టౌన్, మార్చి,17: కాంగ్రెస్ ప్రభుత్వం 18 కులాలకు మాదిరిగానే కుమ్మరి కులవృత్తిదారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కుమ్మరి జాగృతి సంఘం జిల్లా అధ్యక్షుడు భూసారపు గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నో ఏండ్లుగా కుమ్మరి వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్నారని కుమ్మరులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కుమ్మరుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. కుమ్మరులను ఆదుకునే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
ఉచిత శిక్షణ-ఉపాధి
jobs Apply Now!
★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహింద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.
NTK-311116

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆదిలాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

అవగాహన కల్పిస్తున్న సీఐ సైదారావు

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

ఖానాపూర్ టౌన్, మార్చి 17: వ్యాపారులు తమ షాపుల ఎదుట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఖానాపూర్ సీఐ సైదారావు సూచించారు. ఖానాపూర్ సర్కిల్ కార్యాలయంలో పట్టణ వర్తక సంఘం సభ్యులతో ఆదివారం ఆయన మాట్లాడారు. అనుకోని సంఘటనలు జరిగితే, సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. పట్టణంలో కొత్త కెమెరాలు ఏర్పాటు చేయడం, పాత కెమెరాల మరమ్మతులపై ఆయన చర్చించారు. ఎస్ఐ లింబాద్రి, తదితరులున్నారు.

నిర్మల్ కవి రాజారావు కు ఘనసన్మానం

నిర్మల్ టౌన్, మార్చి,17: ప్రముఖ కవి, రచయిత మునిమడుగుల రాజారావును ఆదివారం నిర్మల్‌కు చెందిన లయన్స్ క్లబ్, రచయితల వేదిక ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ సాహిత్యానికి ఆయన చేస్తున్న సేవలకు గాను సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల హనుమంతు, తుమ్మల దేవరావు, దామెర రాములు, మురళీధర్, పురుషోత్తంరావు, మునీందర్, జగదీశ్వర్, నారాయణ, కృష్ణంరాజు, తదితరులున్నారు.

హెచ్ఐవీ నిర్మూలనపై కళాజాత

ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

కడెం, మార్చి 17: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా యిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం కడెం మండలకేంద్రంలో వారసంత వద్ద కళాజాత నిర్వహించారు. ఆదిలాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు నటరాజ్ కల్చరల్ మీడియా ఆధ్వర్యంలో ఎయిడ్స్ నిర్మూలనపై ప్రజలకు ఆటాపాటల ద్వారా అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎల్‌డబ్ల్యూ లత, బృందం సభ్యులు కత్లె శ్రీధర్, ఆనంద్, వీరేశ్, దత్తు, ఉల్గేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

ఒకరి ఆత్మహత్య

లక్ష్మణచాంద, మార్చి 17: మండలంలోని పీచర గ్రామానికి చెందిన రుద్రారపు భీమన్న (38) క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. భీమన్న కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది, శనివారం క్రిమిసంహారక మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు నిర్మల్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

కుంటాలలో యువకుడు..

కుంటాల, మార్చి, 17: మండల కేంద్రానికి చెందిన కొండం శ్రీకాంత్ (20) ఆదివారం చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ దినకూలీగా పనిచేస్తున్నాడు. ఏడాదిగా అదే గ్రామానికి చెందిన ఒక యువతిని ప్రేమిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలుస్తున్నది. దీంతోనే ఓ వ్యవసాయ క్షేత్రంలోని చెట్టుకు శ్రీకాంత్ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ దేవారావు తెలిపారు.

'హరిత' రక్షణ

- వేసవిలో షెడ్‌నెట్‌లతో మొక్కలకు మేలు

మొక్కల సంరక్షణ కోసం ఏర్పాటు చేసిన గ్రీన్ నెట్

దస్తురాబాద్, మార్చి 17: పల్లెలను హరితవనంగా తీర్చిదిద్దేందుకు కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన హరిత హారంలో భాగంగా ప్రతి గ్రామానికి ఒకటి చొప్పున నర్సరీలను ఏర్పాటు చేసింది. మొక్కల సంరక్షణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వేసవిలో ఎండ తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా గ్రీన్ నెట్లను ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలను ఏర్పాటు చేసి 13 వేల మొక్కలను పెంచుతున్నారు. మండల వ్యాప్తంగా 1.69 లక్షల మొక్కలను రానున్న హరిత హారం కోసం సిద్ధం చేస్తున్నారు. రోజురోజుకూ ఎండ తీవ్రత పెరగడంతో ఎండలు మండి పోతున్నాయి. మొక్కలు వాడి పోకుండా నిత్యం మొక్కలకు నీటినందిస్తున్నారు. వాటిని సంరక్షించేందుకు పంచాయతీ సిబ్బంది నర్సరీలపై గ్రీన్ నెట్ ఏర్పాటు చేశారు. మండలంలోని బుట్టాపూర్, మున్యాల, మల్లాపూర్, దస్తురాబాద్, దేవుని గూడెం, ఆకొండపేట, భూత్కూర్, గొడిసెర్యాల్ తదితర పంచాయతీల్లో ఈ మొక్కలను పెంచుతున్నారు.

మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి

హరతహారం మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాం. నర్సరీలో మొక్కలు ఎండిపోకుండా షెడ్ నెట్లను ఏర్పాటు చేశాం. నిత్యం పర్యవేక్షిస్తున్నాం. రానున్న హరిత హారం కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేస్తున్నాం. గ్రీన్ షెడ్ నెట్ల ద్వారా మొక్కలు వేడిని తట్టుకుంటాయి. ఎండకాలంలో ఇవి ఎంతో మేలు చేస్తాయి.

-రవి ప్రసాద్, ఏపీవో,దస్తురాబాద్

ఎండకాలం.. పశువులు జాగ్రత్త

- ఈ ఏడాది గతంకంటే గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- యాజమాన్య జాగ్రత్తలు పాటించాలన్న పశుసంవర్ధక శాఖ అధికారులు

చెట్ల కింద సేదతీరుతున్న పశువులు

ఖానాపూర్, మార్చి 17: ఈ వేసవి పూర్తయ్యేంత వరకు పశువుల్లో వ్యాధి నిరోధకశక్తి తగ్గకుండా చూడాల్సిన బాధ్యత పశుపోషకదారులపై ఉంది. అధిక ఉష్ణోగ్రత, గాలి ప్రసరణ సరిగ్గా లేకపోవడం, షెడ్లలో అధిక సంఖ్యలో కిక్కిరిసి పోవడం, ఉక్కపోత, నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం మూలంగా పశువులు, గొర్రెలు, మేకలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదముంది. వడదెబ్బకు గురైన పశువులు క్రమంగా నీరసించి సరిగ్గా నడవలేక పోయి తులి పడిపోతాయి. జీర్ణప్రక్రియ తగ్గిపోవడం, ఆకలి మందగించడం, ఆహారం తక్కువ తీసుకోవడంతో ఉత్పత్తి గణనీయంగా తగ్గిపోతుంది. వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోవడంతో ఇతర వ్యాధులు, పరాన్న జీవులు ఆశించే అవకాశ ముంది. కొన్ని సమయాల్లో దాహంతో ఉన్న పశువులు మురికి గుంటల్లో నీటిని తాగడంతో పారుడు వంటి జీవకోశ రోగాలు వచ్చే అవకాశం ఉంటుంది. చూడి పశువుల్లో గర్భస్రావం, వడదెబ్బకు గురైన పశువుల్లో దాహం పెరగడం నడుస్తూ కిందపడిపోవడం జరుగుతుంది. ఒక్కొక్కసారి శ్వాస కష్టమై అపస్మారక స్థితిలోకి వెళ్లి మృతి చెందే అవకాశం ఉంటుంది. ఇలాంటి సమయం చల్లని ప్రదేశంలో ఉంచి బాకెట్ నీటిలో కిలో బెల్లం వేసి తాగించాలి. అనంతరం సమీపంలోని పశువుల డాక్టర్‌ను సంప్రదించాలి.

పచ్చిగడ్డితో మేలు

వేసవిలో సులువుగా జీర్ణమయ్యే గడ్డినివ్వడంతో పాటు ఎక్కుశాతం పచ్చి మేతను ఇవ్వాలి. పచ్చిగడ్డి ఉదయం, రాత్రి సమయాల్లో ఎండుగడ్డి ఇస్తే మంచి ప్రయోజనకరంగా ఉంటుంది. తౌడులాంటి దాణాలో ఉప్పు కలిపిన ద్రావణం ఇవ్వడం మంచిది. పశువులను ఉదయం 6 గంటల నుంచి 11 గంటల వరకు సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు బయటకు పంపడం మంచిది.

చల్లటి నీటిని తాగించాలి

వేసవికాలం పూర్తయ్యేంత వరకు పశువులకు చల్లటి నీటిని ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. పరాన్న జీవుల నిర్మూలనకు నట్టల నివారణ మందులు క్రమంగా తాగించాలి. వడదెబ్బ సోకిన పశువులకు ప్రథమ చికిత్స అందించి శరీర ఉష్ణోగ్రత తగ్గించే చర్యలు తీసుకోవాలి.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

గతంలో కంటే ఎండల ప్రభావం తీవ్రంగా ఉంది. పశువుల యజమానులు జీవాల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పశువులకు ఎండదెబ్బ తగలకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పచ్చిగడ్డికి ప్రాధాన్యం ఇవ్వాలి. చల్లటి నీటిని తాగించి చల్లటి వాతావరణంలో బయటకు పంపాలి. ఈ రెండు నెలలు పశువులను జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన బాధ్యత యజమానులపై ఉంది.

-రామచంద్రుడు, ఏడీ, పశువుల దవాఖాన

వేసవి దుక్కులు రైతులకు మేలు

- వాలుకు అడ్డంగా దున్నాలి
- లోతు దుక్కులతో భూసారం అధికం

ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

భైంసా, మార్చి 17: వేసవి కాలం ప్రారంభమైంది. ఈ సమయంలో ఖాళీ పొలాలను దున్నుకుంటే రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. ఖరీఫ్‌లో వేసిన పంటలు చేతికి వచ్చాయి. పంట పొలాల్లో ఉన్న కట్టెలు, చెత్తా చెదారాన్ని తొలగిస్తున్నారు. ఈ క్రమంలో నేలను దున్నకుండా వదిలేయకూడదు. వేసవి దుక్కులతో చాలా ఉపయోగాలున్నాయి. దుక్కులు చేయకుండా వదిలేస్తే పంటలు చేతికివచ్చాక మళ్లీ సాగు చేసే వరకు భూమిని ఖాళీగా ఉంచడం మంచిది కాదు. భూమిని ఖాళీగా వదిలేస్తే కలుపుమొక్కలు పెరిగి భూమిలోని నీటిని పోషక పదార్థాలను గ్రహిస్తాయి. తద్వారా భూమిలో సత్తు వ లేకుండా పోతుంది.

లోతు దుక్కులతో మరింత మేలు

భూమిని లోతుగా దున్నడంతో రైతులకు ఎంతో మేలు కలుగుతుంది. తొలకరి వర్షాలకు ముందే భూమిని వాలుకు అడ్డంగా, లోతుగా దున్నాలి. ఇలా చేస్తే భూమిపై పొరలు కిందికి, కింది పొరలు పైకి తేలి భూమి సారం పెరుగుతుంది. వానలు పడినప్పుడు నీరు బాగా ఇంకిపోయి తేమ శాతం అధికమవుతుంది. అలాగే కలుపును బాగా నివారించవచ్చు. అంతేగాకుండా భూమి కోతకు గురికాదు.

పశువుల మందలు పెట్టుడు తప్పనిసరి

వేసవి దుక్కులు దున్నేముందు గొర్రెలు, మేకలను ఖాళీ పొలాల్లో ఉంచాలి. అవి విసర్జించే మలమూత్రలు భూమిలోకి చేరి భూసారం పెరుగుతుంది. దీంతో పంటల్లో సూక్ష్మ పోషకాల లోపాలు నివారించవచ్చు. అవకాశం ఉంటే కంపోస్టు లేదా చెరువు మట్టి పొలంలో చల్లితే ఖరీఫ్ పంటలకు మరింత మేలు కలుగుతుంది.

దుక్కులతో తెగుళ్ల నివారణ

అనేక రకాల పురుగులు పంట కోత తర్వాత వాటిని నిద్రావస్థ దశలను నేలలో, చెత్తా చెదారంలో కొయ్యకాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలిగించే శిలీంధ్రాలు భూమిలోపల ఆశ్రయం పొందుతాయి. వాటి శిలీంధ్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. ఈ దశలో లోతుగా దున్నితే నిద్రావస్థ దశలో భూమిలో ఉన్న చీడపురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు, ప్యూపాలు బయటపడి అధిక ఉష్ణోగ్రతకు గురై చనిపోతాయి. ఏమన్న మిగిలిపోయినా పక్షులు, కొంగలు, కాకులు తిని నాశనం చేస్తాయి. దుక్కులతో లోపలి పొరల్లో ఉన్న శిలీంధ్ర బీజాలు మట్టితో పాటు నేలపైకి వస్తాయి. ఆ సమయంలో అధిక ఉష్ణోగ్రతకు గురై వ్యాధి కలగజేసే శక్తిని కోల్పోతాయి.